సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 12 । జూలై । 2023



సాగునీరు చేరిన వేళ

తోటపల్లి నీరు నెల ముందుగానే జిల్లాకు చేరింది. రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

- 8లో



లోను పేరుతో టోకరా

లోను పేరుతో ఓ ముఠా టోకరా వేస్తోంది. పోలీసులు ఇద్దరిని పట్టుకున్నారు.

- 8లో

సెప్టెంబర్ 24న రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలో సెప్టెంబర్ 24న రాష్ట్రస్థాయి ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు శివకుమార్, గౌరీశంకర్ తెలిపారు. నగరంలోని ఫ్లెక్స్ జిమ్‌లో మంగళ వారం పోటీల పోస్టర్‌ను విడుదల చేశారు.తెలుగు రాష్ట్రాల్లోని బాడీబిల్డర్లు అసోసి యేషన్‌లతో సంబంధం లేకుండా పాల్గొనవ చ్చునని చెప్పారు.

న్యూస్‌రీల్

రోడ్డు నిర్మాణానికి స్థల దానం



నీలకంఠ పాణిగ్రాహి దంపతులకు స్వాగతం పలుకుతున్న గ్రామ సర్పంచ్, పెద్దలు

ఎల్ఎన్ పేట: లక్ష్మీనర్సుపేట గ్రామంలోని వంశధార తీరంలో ఉన్న శ్రీబంగారమ్మ తల్లి అమ్మవారి గుడికి వెళ్లే దారికి అవసరమయ్యే స్థలాన్ని అదే గ్రామానికి చెందిన నీలకంఠ పాణిగ్రహి దానం చేశారు. బంగారమ్మ తల్లి ఆలయ ప్రాంగణం వద్ద మంగళవారం ఈ మేరకు అవసరమయ్యే స్థలాన్ని దారి నిర్మాణం కోసం రాసి ఇచ్చారు. ఎంతో విలువైన భూమిని ఆలయానికి దానమిచ్చిన నీలకంఠ పాణిగ్రహిని సర్పంచ్ ముగడ దివాకర్, శ్రీబంగారు సంతోషి సంస్థల సభ్యులు వైశ్యరాజు చంద్రశేఖరరాజు (పొట్టిరాజు), పాండురంగనాధ రాజు, శ్రీనివాస రాజు, ముగడ జనార్థన, ఉప సర్పంచ్ అశోక్ పాణిగ్రహి, ఊణ్ణ ఫకీరు, ఒనుమ తిరుమల తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

గల్లంతైన మత్స్యకారుని మృతదేహం లభ్యం

గార: బందరువానిపేట తీరంలో ఆదివారం జరిగిన పడవ బోల్తా ప్రమాదంలో గల్లంతైన గుంటు గణపతి (50) మృతదేహం సంతబొమ్మాళి మండలం మూలపేట తీరంలో లభ్యమైంది. స్థానికులు సంతబొమ్మాళి పోలీసులకు సమాచారం అందించగా బందరువానిపేటకు చెందిన గణపతిగా నిర్ధారించారు. గణపతికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

'కార్మికుల శ్రేయస్సే మా ధ్యేయం'



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ కార్మికుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషిచేసిన యూనియన్ ఎంప్లాయిస్ యూనియన్ అని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం వద్ద మంగళవారం పలిశెట్టి దామోదరరావు ఈయూ జెండాను ఆవిష్కరించి 72వ వార్షికోత్సవాలు నిర్వహించారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయిన తర్వాత ఏపీ పీటీడీగా మారిందన్నారు. త్వరలోనే ఈయూ సంఘానికి ప్రభుత్వపరంగా గుర్తింపు లభించనుందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రతి నెలా 3వ శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ ఉందని తెలిపారు.

ఇంటిపై పిడుగు పాటు



పాతపట్నం: పాత పట్నం మండల కేంద్రంలోని పిల్లివీధికి చెందిన దంతం రామారావు ఇంటిపై మంగళవారం పిడుగు పడింది. మొదటి ఫ్లోర్‌పై పిడుగు పడడంతో శ్లాబ్ గోడలకు పగుళ్లు వచ్చాయి. ఇంటిలో ఉన్న వాళ్లకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

వలంటీర్లు మాలో ఒకరే..

వారిపై ఎందుకంత కక్ష



పింఛన్ ఆఫీసు ముందు కట్టిన క్యూలు అందరికీ ఇంకా గుర్తున్నాయి. చేతిలో సంచి పట్టుకుని రేషన్ షాపుల ముందు ఎండల్లో గంటల తరబడి పడిగాపులుకాసిన రోజులు ఎవరూ మర్చిపోలేదు. కానీ ఈ రోజు ఎవరూ పింఛన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో పడిగాపులు కాయడం లేదు. రేషన్ కోసం డీలర్ల ముందు బారులు తీరి నిరీక్షించడం లేదు. కారణం వలంటీర్ వ్యవస్థ. అంతేనా.. పథకాల కోసం అధికారుల చుట్టూ తిరగడం ఆగిపోయింది. పౌర సేవల కోసం యాతన పడే దుస్థితే లేదు. అలాంటి వలంటీర్ వ్యవస్థపై దేశవ్యాప్తంగా ప్రశంసలు కురుస్తూ వేరే రాష్ట్రాల వారు వచ్చి అధ్యయనాలు చేస్తుంటే.. జనసేన నేత పవన్ కల్యాణ్ మాత్రం విషం కక్కుతున్నారు. నిన్నమొన్నటి వరకు అన్నా, తమ్ముడు అని పిలిచిన వారే నేడు ఆ ప్రాంతాల్లో వలంటీర్లుగా సేవలు అందిస్తుంటే.. వారిని పట్టుకుని ఆడపిల్లల సమాచారం సేకరిస్తున్నారని అభాండాలు మోపుతున్నాయి. అక్కా, చెల్లి అని పలకరించుకున్న వారే ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలు అందిస్తుంటే మానవ అక్రమ రవాణాకు సాయం చేస్తున్నారని మతి లేని వ్యాఖ్యలు చేస్తున్నారు. మరోవైపు సాయం పొందిన వారు మాత్రం వలంటీర్లను కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నారు. ఆ సేవకు సాక్ష్యాలివే..

– టెక్కలి/ఇచ్ఛాపురం రూరల్/ కొత్తూరు

ప్రాణాలు పణంగా పెట్టాం

కరోనా సీజన్‌లో ప్రాణాలను పణంగా పెట్టి గ్రామాల్లో ప్రజలకు సేవలు అందించాం. ముఖ్యంగా క్వారంటైన్‌లో ఉండే వారికి అవసరమైన సదుపాయాలు సమకూర్చుతూ మరో వైపు మాస్కులు ధరించి ఇంటింటి ఫీవర్ సర్వేలు నిర్వహించాం. ఇంట్లో పసిపాపలతో పాటు కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ సేవే పరమార్థంగా భావించి సేవలు అందించిన మాపై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. కరోనా సమయంలో గెస్ట్ హౌస్‌లో గడిపిన ఆయన వలంటీర్ల గురించి అనుచితంగా మాట్లాడటం క్షమించరాని నేరం. వెంటనే క్షమాపణలు చెప్పాలి.

– వలంటీర్లు, మండపల్లి గ్రామ సచివాలయం



ఫీవర్ సర్వే చేస్తున్న మండపల్లి వలంటీర్లు(ఫైల్)

వేస్ట్ టికెట్‌ల మాటలను పట్టించుకోవద్దు



సమాజంలో కొంతమంది వేస్ట్‌టికెట్‌లు ఉంటారు. అలాంటి వారు చేసిన ఆరోపణలు వలంటీర్లు పట్టించుకోవద్దు. వలంటీర్ల సేవలను కేంద్రం కూడా ప్రశంసించింది. ప్రభుత్వ పథకాలు సజావుగా అందుతున్నాయంటే వలంటీర్లే కారణం. కడుపున పుట్టకపోయినా కన్న బిడ్డల్లా ప్రతి కుటుంబానికి సేవ చేస్తున్నారు.

– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి (రాగోలులో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో)

క్షమాపణ చెప్పాలి..



వలంటీర్లకు పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి. ప్రజలకు పథకాలు అందిస్తున్న వారిని కించపరిచేలా మాట్లాడడం భావ్యం కాదు. పవన్ మాట్లాడిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉంది.

– తమ్మినేని సీతారాం, స్పీకర్ (దీడివలసలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో..)



రణస్థలం : జే.ఆర్.పురం ఎస్సై రాజేష్‌కు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



మందస: పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

వలంటీర్లే ఆదుకున్నారు..



కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివి. నేను చేపల వేటకు చెన్నై వెళ్లాను. కరోనా విజృంభించడంతో భయపడి స్నేహితులం అందరం కలసి గ్రామానికి వచ్చేశాం. పోలీసులు మమ్మల్ని అడ్డుకుని క్వారంటైన్‌లో ఉంచారు. కనీసం మా బంధువులను కూడా చూసేందుకు రానివ్వలేదు. మాపై కుటుంబ సభ్యులు బెంగ పెట్టుకున్నారు. అలాంటి సమయంలో మా ఏరియా వలంటీర్లు మాకు సేవలు చేశారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మా ఇళ్ల వద్ద నుంచి భోజనాలు తెచ్చి ఇచ్చారు. మా ఇంటి వారితో ఫోన్‌లో మాట్లాడించారు. వారి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మా కోసం పనిచేశారు. వీరిపై పవన్ కల్యాణ్ తప్పుగా మాట్లాడడం తగదు. క్షమాపణలు చెప్పాల్సిందే.

– కర్రి తాతారావు, మత్స్యకారుడు, డొంకూరు, ఇచ్ఛాపురం మండలం

సేవలు మరచిపోలేం



నేను నడవలేని పరిస్థితిలో ఉన్నాను. ఇలాంటి సమయంలో కుటుంబ సభ్యుల కంటే ఎక్కువగా మా వలంటీర్ పూర్ణిమ నన్ను ఎంతో చక్కగా చూసుకుంటోంది. పింఛన్ కాకుండా రేషన్ కూడా తెచ్చిపెడుతోంది. అంతే కాకుండా నాకు ఏది అవసరమైనా సొంత బిడ్డలా పనిచేస్తోంది. ఆమె చేస్తున్న సేవలు నేను మరచిపోలేను.

– పోలాకి అరుద్రమ్మ, దివ్యాంగురాలు, సర్వమంగళవీధి, టెక్కలి.

కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నారు



నా కుటుంబ సభ్యులే నన్ను సక్రమంగా పట్టించుకోని పరిస్థితిలో గ్రామ వలంటీర్ రోజా నా బాగోగులు అన్నీ చూసుకుంటోంది. ప్రతి నెల ఒకటో తేదీ ఉదయం 5 గంటలకే పింఛన్ ఇస్తుంది. అంతే కాకుండా మిగిలిన సంక్షేమ పథకాల గురించి నాకు చెబుతూ ఉంటుంది. వలంటీర్ లేకపోతే నా పరిస్థితి ఎలా ఉండేదో భయం వేస్తోంది.

– కల్లేపల్లి లక్ష్మి, వృద్ధురాలు, చిన్నబజారు వీధి, టెక్కలి

సొంత మనవడిలా..

ఇచ్ఛాపురం మండలం మశాఖపురం గ్రామానికి చెందిన 86 ఏళ్ల ఈ వృద్ధురాలి పేరు మద్ది లక్ష్మమ్మ. ఏడాది క్రితం అనారోగ్యంతో మంచాన పడితే...భువనేశ్వర్‌లో ఉన్న కుమార్తె ఈమెను తీసుకెళ్లారు. రెండు కిడ్నీలు పోయాయంటూ చెప్పడంతో ప్రస్తుతం వృద్ధురాలు కుమార్తె వద్దనే ఉంటూ చికిత్స పొందుతోంది. ప్రస్తుతం రెండు కాళ్లు పనిచేయడం లేదు. దీంతో ఆమె పెన్షన్‌ను వలంటీర్ దుర్గాశి భాస్కరరావురెడ్డి ప్రతి నెలా భువనేశ్వర్ వెళ్లి మరీ అందిస్తున్నారు. లక్ష్మమ్మ మాట్లాడుతూ తనకు కుమారుడు లేకపోయినా పెద్ద కుమారుడిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తరఫున మనవడు భాస్కరరావు పింఛన్ ఇస్తున్నాడని, చార్జీ డబ్బులు ఇచ్చినా తీసుకోలేదని తెలిపారు.



భువనేశ్వర్ వెళ్లి వృద్ధురాలు లక్ష్మమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ భాస్కరరావు రెడ్డి (ఫైల్)



ఆమదాలవలస: వలంటీర్ల మానవహారం

విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స


- జిల్లా చరిత్రలో ఇదే తొలిసారి

కవిటి: ఆరోగ్య శ్రీ పథకం ఆసరాతో శ్రీకాకుళంలో పూర్తిగా జిల్లాకు చెందిన నిపుణుల పర్యవేక్షణలో తొలికిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమైంది. శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి నెఫ్రాలజీ వైద్యనిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరావు, డాక్టర్ కొర్ల విద్యాసాగర్ నేతృత్వంలో కిడ్నీ మార్పిడి చేసుకున్న వ్యక్తి కంబాల ముకుందరెడ్డి ఆస్పత్రి వైద్యులకు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. టెక్కలి నియోజకవర్గం నౌపడకు చెందిన ముకుందరెడ్డి ఆరుమాసాల కిందట తీవ్ర అనారోగ్యం పాలై మెడికవర్ ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్నారు. అప్పటికే అతనికి కిడ్నీలు పాడైనట్టు వైద్యులు తెలిపారు. దీంతో తక్షణమే అతనికి హీమో డయాలసిస్‌ను వైద్య నిపుణులు సిఫారసు చేశారు.అప్పటి నుంచి అతనికి డయాలసిస్ ప్రక్రియతో వైద్యం అందుతోంది. ఈ నేపథ్యంలో తన తల్లి కిడ్నీ ఇచ్చేందుకు అంగీకరించారు.



శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స అనంతరం వివరాల్ని వెల్లడిస్తున్న వైద్య నిపుణులు

దీంతో మరోసారి అన్ని వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులు కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సను శ్రీకాకుళం మెడికవర్‌లో చేసేందుకు సిద్ధమయ్యారు. అనుకున్నట్టుగానే నెఫ్రాలజీ నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరావు, డాక్టర్ కొర్ల విద్యాసాగర్‌ల పర్యవేక్షణలో డాక్టర్ దుంపల హరిప్రసాద్ కిడ్నీమార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కిడ్నీ మార్పిడి చేసి వారం రోజుల వరకు అతడిని వైద్యులు ఐసీయూ పర్యవేక్షణలో ఉంచారు.



కొత్తగా అమర్చిన కిడ్నీ ఫంక్షనింగ్ విజయవంతమైందని మంగళవారం పరీక్షలు చేసి నిర్ధారించారు. సీరం క్రియాటినైన్ 0.99గా రావడంతో అంతటా హర్షం వ్యక్తమైంది. ఇతర ఫలితాలు కూడా సాధారణ స్థితిలో నమోదైయినట్టు డాక్టర్ ఆర్.రంగనాథరావు తెలిపారు. వారం రోజుల పాటు పరిశీలించి అన్ని రిపోర్టులు బాగున్నాక మంగళవారం డిశ్చార్జి చేసినట్లు వైద్యులు తెలిపారు. కిడ్నీదాత బాధితుడికి రక్తసంబంధీకులు అయితే తక్కువ మందుల ఖర్చుతో మార్పిడి ప్రక్రియ సులభం అవుతుందన్నారు. అయితే ఆరోగ్యశ్రీ పథకంలో కిడ్నీమార్పిడి చేసుకున్న ముకుందరెడ్డికి ఏడాదికాలం పాటు పోస్ట్ ఆపరేటివ్ కేర్‌గా మందులు, వైద్యం ప్రభుత్వం ఉచితంగా అందించనుండడం విశేషం.

విపత్తులపై అప్రమత్తత అవసరం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇప్పటి నుంచి డిసెంబర్ వరకు తుఫాన్ల తాకిడి ఎక్కువగా ఉంటుందని, ముప్పును పసిగట్టి ముందుగానే అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ ఏడాది దక్షిణ, పశ్చిమ రుతుపవనాలకు సంబంధించి జిల్లా అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. జిల్లా అధికారులు అందరూ విపత్తులు ఎదుర్కొనేందుకు కావాల్సిన సామగ్రి, సిబ్బందితో సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పునరావాస కేంద్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో మరమ్మతు పనులు ఉంటే తక్షణమే చేయించాలన్నారు. వంశధార నదికి సంబంధించి వంశధార ఎస్ఈ డి.తిరుమలరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. మెటీరియల్ అంతా సిద్ధంగా ఉందని తిరుమలరావు వివరించారు. అతి ప్రమాదకర గ్రామాలను గుర్తించి వరద నివారణ చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్‌ను ఆదేశించారు. ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ రెవెన్యూ, ఇతర శాఖలతో కలిసి ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుకు అన్ని సిద్ధం చేసుకున్నట్లు వివరించారు. జేసీ నవీన్ మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని, డివిజనల్ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రెవెన్యూ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ తహసీల్దార్లకు ముందుగానే సూచనలు అందించామన్నారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో తీసుకోనున్న చర్యలను వివరించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

అమ్మ సూచన

తనయుడి ఆచరణ

పలాసకు తిరుమలేశుని వలస

- తిరుపతిలో సంతృప్తకర దర్శనం జరగలేదని ఏకంగా ఆలయ నిర్మాణం
- తల్లి చెప్పిన మాట ప్రకారం తిరుమలేశునికి గుడి
- పలాసలో 12 ఎకరాల్లో చకచకా కోవెల పనులు
- నిరుపేదల కోసం రెండెకరాల్లో కల్యాణ మండపం
- భక్తిని చాటుకుంటున్న హరి ముకుందా పండా

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఓ తల్లి ఇచ్చిన ఆదేశం.. పన్నెండు ఎకరాల ప్రాకారం.. ఐదేళ్లుగా సాగుతున్న నిర్మాణం..తిరుమల నుంచి తెచ్చిన ఏకశిలా విగ్రహం.. వెరసి ఓ భక్తుడి కల నెరవేరుతోందిలా. పదేళ్ల కిందట తల్లి వద్దకు వెళ్లి 'అమ్మా.. స్వామి దర్శనం సంతృప్తిగా జరగలేదు' అని చెబితే.. ఇక్కడే తిరుమలను పోలిన గుడి కట్టుకోవచ్చు కదా.. అని తల్లి చెప్పింది. అంతే అమ్మ ఆజ్ఞను పాటిస్తూ ఆయన ఆ తిరుమలేశుని పలాస తీసుకువచ్చే క్రతువుకు శ్రీకారం చుట్టారు. ఐదేళ్లుగా సాగుతున్న ఈ నిర్మాణ క్రతువు ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. ఒడిశా రాజ కుటుంబానికి చెందిన హరి ముకుందా పండా ఈ మహత్కార్యాన్ని నెత్తిన వేసుకుని పూర్తి చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

ఒడిశా రాజకుటుంబానికి చెందిన హరి ముకుందా పండా తల్లి పేరు హరి విష్ణుప్రియ పండా. నిత్యం దైవ ధ్యాసలో ఉంటూ దానధర్మాలు చేస్తుంటారు. ఆమె ఒక్కగానొక్క కొడుకు హరి ముకుందా పండా. పదేళ్ల కిందట ఆయన మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ తిరుమల వెంకన్న దర్శనానికి వెళ్లారు. కానీ స్వామి దర్శనం సంతృప్తికరంగా జరగలేదని తల్లి వద్ద చెప్పుకుని బాధ పడ్డారు. దీంతో ఆ తల్లి తన కుమారుడి ఆవేదనను అర్థం చేసుకుని.. తనకున్న కొబ్బరి తోటలోని 12 ఎకరాల స్థలంలో శ్రీవారి ఆలయ నిర్మాణం చేపట్టమని చెప్పింది. దాంతో 95 ఏళ్ల వయస్సులో ఉన్న హరి ముకుందా ఐదేళ్ల కిందట నిర్మాణాన్ని ప్రారంభించారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అతి పెద్ద పండ్లతోట పండావారి తోటగా ప్రసిద్ధి చెందింది. దానికి యజమాని హరిముకుంద పండా. ఆయనే ప్రస్తుతం అందమైన ఆలయాన్ని నిర్మించి వేంకటేశ్వరస్వామిపై తన దైన శైలిలో భక్తి భావం చాటుకుంటున్న దార్శనికుడిగా చరిత్రలో నిలిచిపోతున్నారు.



హరి ముకుందా పండా

తొంభైలో ఇరవైలా..

వయసు శరీరానికే తప్ప మనసుకు మాత్రం కాదని ఆయన నిరూపిస్తున్నారు. బ్రహ్మ ముహూర్తంలో తెల్లవారి 3గంటలకు లేచి దినచర్యను ప్రారంభించే ఆయన ప్రకృతికి దగ్గరగా ఉంటారు. యోగా ప్రాణాయామంతో పాటు దైవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలకు ఆలయానికి వచ్చి రాత్రి నిద్రపోయే వరకు ఆలయం నిర్మాణంలోనే మమేకమవుతున్నారు. మధ్యలో వ్యవసాయ పనులు చేస్తుంటారు. తోటలో ట్రాక్టర్‌ను తానే నడుపుతూ అన్ని పనులు చేసి పూర్వపు ఆహార అలవాట్లు పాటిస్తున్నారు. కేవలం ఒక్కపూట మాత్రమే భోజనం చేస్తారు. ఎలాంటి మందులు వాడకుండా పండించే వివిధ రకాల పండ్లను కొనుగోలు చేయడానికి ఆయన తోట వద్ద క్యూ కడుతుంటారు. పన్నెండేళ్ల వయస్సులో స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. ప్రస్తుతం ఈయనొక కుమారుడు ఉన్నారు. ఆయన వైద్య వృత్తిలో కొనసాగుతున్నారు. హరి ముకుంద తర్వాత ఆలయ బాధ్యతలు ఆయనే చూసుకోనున్నారు.

రూ.5 కోట్లకుపైగా నిధులతో..

ఒకటి కాదు రెండు కాదు ఏకంగా వందలాది దేవతా మూర్తుల విగ్రహాలతో అద్భుతమైన కట్టడాలకు చిరునామాగా పలాస మారనుంది. అందుకు ఒక్క రూపాయి చందా తీసుకోకుండా తిరుమలలో ఉన్న వేంకటేశ్వరస్వామి విగ్రహంతో సమానమైన ఏకశిల విగ్రహాన్ని (తొమ్మిదిఅడుగుల) తయారు చేయించి తిరుపతి నుంచే తెప్పించారు. ఆలయంలో ప్రత్యేకతలు ఒడిశా సంప్రదాయానికి దగ్గరగా ఉంటాయి.



పింఛన్లు అందజేస్తున్న హరి ముకుందా పండా



పలాసలో నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయం

ఒడియా బ్రాహ్మణ కుటుంబానికి చెందిన హరి ముకుందా పండా వయసుమీద పడుతున్నా హైందవ ధర్మంపై అపారమైన నమ్మకంతో ఈ యజ్ఞానికి పూనుకున్నారు. 12 ఎకరాల్లో నిర్మిస్తున్న ఆలయంలో కోనేరును సైతం నిర్మిస్తున్నారు. దానికి ఎదురుగా నిరుపేదల పెళ్లిళ్లకు ఉపయోగపడే విధంగా రెండు ఎకరాల్లో కల్యాణమండపం నిర్మించి టీటీడీకి అందివ్వనున్నారు. ఇప్పటికే రెండెకరాలు భూమిని టీటీడీకి రాసేశారు.

వారానికి లక్షల్లో పింఛన్లు పంపిణీ..

ఒక్క దేవాలయం నిర్మాణంతోనే తన ఔదార్యాన్ని పరిమితం చేయలేదు. తన వద్దకు వచ్చే ఎంతోమంది పేదవాళ్లకు సాయం కూడా చేస్తున్నారు. ఆంధ్రా–ఒడిశా సరిహద్దే కాకుండా రాష్ట్రంలో, దేశంలో ఏ మూలనుంచి వచ్చినా వారానికి ఒక్కసారి కడుపు నిండా భోజనం పెట్టి.. దివ్యాంగత్వాన్ని బట్టి పింఛన్లు అందిస్తున్నారు. ప్రతి సోమవారం పండాతోట నుంచి పలాస రైల్వేస్టేషన్‌కు ఒక ప్రత్యేక ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి దివ్యాంగుల రాకపోకలకు సౌకర్యం కల్పిస్తున్నారు. వారానికి 200మందికి భోజనంతో పాటు రూ.లక్షల్లో పింఛన్లు అందజేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి రాలేనివారికి ఏడాదికి రూ.10వేలు డిపాజిట్ చేస్తున్నారు. రెండు కాళ్లు, రెండు కళ్లు లేనివారికి మాత్రమే ఇవి అందిస్తున్నారు. ఏనాడూ ప్రచారాలకు పోకుండా... రాజకీయాలకు దూరంగా ఉంటూ సేవ చేస్తున్నారు.



ఆలయ లోపల భాగం

పలు రైళ్లు రద్దు



పునరుద్ధరణ పనులు పరిశీలిస్తున్న వాల్తేర్ డీఆర్ఎం అనుప్ కమార్ సత్పతి

కొరాపుట్: కొత్తవలస - కిరండోల్ రైల్వే లైన్‌లో కొరాపుట్ మీదుగా వెళ్లే పలు రైళ్లను రైల్వే శాఖ రద్దు చేస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. కరకవలస-బొర్రా గుహల మధ్య ట్రాక్ మీద రాళ్లు విరిగిపడడంతో ఈ చర్యలు తీసుకున్నారు. 18514 నంబర్ గల విశాఖపట్నం-కిరండోల్ ఎక్స్‌ప్రెస్, 18513 నంబర్ గల కిరండోల్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, 08551 నంబర్ విశాఖపట్నం -కిరండోల్ ప్యాసింజర్, 08552 నంబర్ కిరండోల్-విశాఖపట్నం ప్యాసింజర్ రైళ్లను ఈనెల 14వ తేదీ వరకు రద్దు చేశారు. ఈ నేపథ్యంలో రాళ్లు పడిన ప్రాంతాన్ని వాల్తేర్ డివిజనల్ మేనేజర్ అనుప్ కుమార్ సత్పతి సందర్శించారు. ట్రాక్ పునరుద్ధరణ పనులు పరిశీలించారు.

నేటి నుంచి పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ ఎన్నికలు

అరసవల్లి: ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ ఎన్నికలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వారం రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎన్నికలకు ప్రత్యేకంగా ఎన్నికల అధికారులను కూడా నియమించారు. జిల్లాలో అన్ని మండలాల్లోనూ ఈ నెల 12 నుంచి 19 వరకు ఎన్నికల సందడి నెలకొంది. పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల ఉమ్మడి జిల్లా సంఘ అధ్యక్షుడు కిల్లారి నారాయణ రావు, ప్రధాన కార్యదర్శి బి.వి.ఆర్ ప్రసాదరావులు సంయుక్తంగా గత నెలాఖరున ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 19 వరకు జిల్లాలో మినిస్టీరియల్ సంఘం, పాత సమితులు, జెడ్పీ యూనిట్ సభ్యుల ఎన్నికల ప్రక్రియ అంతా పక్కాగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

లోన్ పేరుతో టోకరా

- రూ.5 కోట్లు లోను ఇప్పిస్తామని రూ.35 లక్షలకు టోపీ
- ఇద్దరు అంతర్‌రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసిన గార పోలీసులు
- నాలుగు రాష్ట్రాల్లో పదికి పైగా నేరాలు చేసిన నిందితులు



నిందితులు దాసరి లక్ష్మి, దాసరి కిరణ్‌లతో గార పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్/ గార: గార మండలం శ్రీకూర్మంలో ఇద్దరు అంతర్‌రాష్ట్ర ముఠా సభ్యులు దాసరి లక్ష్మి, దాసరి కిరణ్‌లను అరెస్టు చేసినట్లు గార ఎస్‌ఐ ఎన్.కామేశ్వరరావు పేర్కొన్నారు. ఎస్‌ఐ చెప్పిన వివరాల మేరకు.. తనకు ఫైనాన్స్ ద్వారా రూ. 5 కోట్లు లోను ఇప్పిస్తామని ఇద్దరు వ్యక్తులు, ఇద్దరు మహిళలు నమ్మబలికి రూ. 35 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు గార మండలం చిట్టివలస గ్రామానికి చెందిన పెట్రోల్ బంక్ ఓనర్ గోర సురేష్ గత జూన్ 16న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తే నిజానిజాలు వెలుగులోకి వచ్చాయి.

మోసం చేశారిలా..

గత డిసెంబరులో జగన్నాథం రామక్క (ఏలూరు జిల్లా చింతలపూడి), దాసరి రాంబాబు (గజ్వేల్), వనం శంకర్ (హైదరాబాద్ ఎల్‌బీ నగర్), దాసరి రాము (గజ్వేల్), దాసరి లక్ష్మి (గజ్వేల్), దాసరి కిరణ్ (గజ్వేల్), బి.నవీన్ (ఇన్నోవా కార్ ఓనరు) ఏడుగురు వ్యక్తులు శ్రీకూర్మం వచ్చి పెట్రోల్ బంక్ ఓనర్ గోర సురేష్‌ను కలిశారు. తాము పెద్ద మొత్తంలో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నామని, మీరు 10 శాతం కమీషన్‌గా డిపాజిట్ చెల్లిస్తే మీకు రూ.5 కోట్లు ఇప్పిస్తామంటూ నమ్మబలికారు. ఆ తర్వాత మీరు ఈఎంఐ పద్ధతిలో అసలు సొమ్ము చెల్లించుకోవచ్చన్నారు. వారిని నమ్మిన సురేష్ వెంటనే నగదు రూపంలో రూ. 25 లక్షలను వారికి అందజేశాడు. లోను అమౌంట్ డైరెక్టుగా నీ అకౌంటులో పడుతుందని చెప్పేసి వారు వచ్చిన ఇన్నోవా కారులో వెళ్లిపోయారు. రోజులు గడుస్తున్నా లోను అమౌంటు బ్యాంకు ఖాతాలో పడకపోవడంతో వారిని ఫోన్‌లో నిలదీశాడు. దీంతో వారు ఇదిగో పడతాయి.. వస్తాం.. ఇస్తాం.. అంటూ కాలం వెళ్లదీశారు. ఈ ఏడాది జనవరిలో వారంతా మళ్లీ శ్రీకూర్మం వచ్చి.. మీకు లోను రావాలంటే షూరిటీ కింద పది బ్యాంకు చెక్కులు, పది ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేసి ఇవ్వాలని సంతకాలు చేయించుకున్నారు. అంతే కాకుండా మరో రూ.10 లక్షలు నగదు తీసుకున్నారు. పెద్ద మొత్తంలో అమౌంట్ కాబట్టి మీరు హైదరాబాద్ వచ్చి అక్కడ క్యాష్ తీసుకోవాలన్నారు. దీంతో సురేష్ అక్కడికి ఐదు రోజుల తర్వాత హైదరాబాద్ వెళ్లాక అక్కడ ముందుగానే ఉన్న తమ గ్యాంగ్‌తో నీకు డబ్బులిచ్చేది లేదని మారణాయుధాలతో బెదిరించారు. దీంతో చేసేదేమీ లేక సురేష్ వచ్చేసి పోలీసులను ఆశ్రయించాడు.

హైదరాబాద్‌లో మోసం ద్వారా వెలుగులోకి..

సురేష్ ఇచ్చిన ఫిర్యాదుతో గార ఎస్‌ఐ ఎన్.కామేశ్వరరావు నిందితుల కాల్ డేటా, బ్యాంకు లావాదేవీల ద్వారా ఆధారాలను వెలికి తీయగా వీరి అకౌంట్లకు హైదరాబాద్ ఎస్ఆర్ నగర్‌కు చెందిన రియల్ వ్యాపారి లక్ష్మీకాంత్ అకౌంట్లకు సొమ్ము బదిలీ కావడాన్ని గమనించారు. వెంటనే రియల్ వ్యాపారిని సంప్రదించగా తనకు కూడా రూ. 10 కోట్లు ఇప్పిస్తామని చెప్పి కళ్ల ముందు రూ.5 కోట్లు నగదు చూపించారన్నారు. కమీషన్ కింద రూ. 42 లక్షలు డిపాజిట్ చెల్లించాలన్నారు. చెల్లించాక మిగతా రూ.5 కోట్లు తెస్తామని చెప్పి ఛాయ్ దుకాణం వద్ద వెయిట్ చేయించి.. మావాడికి యాక్సిడెంట్ అయ్యిందంటూ.. ఒక్కొక్కరూ ఒక్కో కారణం చెబుతూ మెల్లిగా జారుకున్నారన్నారు. శ్రీకూర్మం చిట్టివలస బాధితుడు సురేష్ ఫిర్యాదు, హైదరాబాద్ రియల్ వ్యాపారి చెప్పిన వివరాలను ట్యాలీ చేయగా వీరంతా ఏలూరు చింతలపూడికి చెందిన జగన్నాథం రామక్క ప్రధాన పాత్రధారిగా ఉన్న అంతర్‌రాష్ట్ర ముఠాగా తేలింది. వీరి కాల్‌డేటా ఇతర ఆధారాల ద్వారా వీరి గురించి సాంకేతికంగా ఆరా తీస్తుంటే ఓ రోజు కర్ణాటక, మరో రోజు తెలంగాణ, మరో రోజు ఆంధ్రా.. ఇలా మూడు నాలుగు రాష్ట్రాల్లో తిరుగుతున్నట్లు కనిపించింది. వీరి గురించి మరింత విచారణ చేయగా నాలుగు రాష్ట్రాల్లో సుమారు పదికి పైగా ఇలాంటి నేరాల్లో పాల్గొన్నట్లు.. వీరి వెనుక పెద్ద ముఠాయే ఉన్నట్లు పోలీసులు నిర్ధారించుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుల్లో ఇద్దరు తల్లీ కుమారుడులైన దాసరి లక్ష్మి, దాసరి కిరణ్ (గజ్వేల్)లను శ్రీకూర్మంలో మంగళవారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మిగతా ఐదుగురిని త్వరలోనే పట్టుకుని అరెస్టు చేస్తామని, వారి బ్యాంకు ఖాతాలను సీజ్ చేస్తామని ఎస్‌ఐ చెప్పారు.

సాగునీరు చేరిన వేళ..!



శ్రీకాకుళం బ్రాంచ్ కెనాల్‌కు విడుదలైన తోటపల్లి సాగునీరు

- నెల రోజుల ముందుగానే జిల్లాకు చేరిన తోటపల్లి నీరు
- 38,971 ఎకరాలకు లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

రణస్థలం : తోటపల్లి కాలువ ద్వారా సకాలంలో సాగునీరు రావడంతో జిల్లాలోని జి.సిగడాం, లావేరు, రణస్థలం మండలాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అంతటా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తోటపల్లి ద్వారా నీరు వస్తుండటంతో రైతులు వరినాట్లు వేసేందుకు మార్గం సుగమమైంది. తోటపల్లి కాలువ ద్వారా రణస్థలం మండలంలో 21,590 ఎకరాలు, లావేరు మండలంలో 11,008 ఎకరాలు, జి.సిగడాం మండలంలో 6,373 ఎకరాలకు సాగునీరు అందనుంది. మంగళవారం ఉదయం విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం నాగంపేట వద్ద 0.700 వాటర్ ఫ్లోతో శ్రీకాకుళం బ్రాంచ్ కెనాల్‌కు నీరును విడుదల చేశారు. బుధవారం ఉదయానికి రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాలకు పూర్తి స్థాయిలో తోటపల్లి కాలువ సాగునీరు వస్తోంది. దీంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఆగస్టు కంటే ముందుగానే..

ఏటా జూలైలో పార్వతీపురంలోని తోటపల్లి కాలువ వద్ద నీరు విడుదల చేసేవారు. ఆగస్టులో మాత్రమే ఆ నీరు రణస్థలం మండల శివారు భూములకు వచ్చేది. ఈసారి మాత్రం జూలైలోనే నీరు రావడంతో రైతులకు ఖరీఫ్ వరినాట్లుకు సమాయత్తమవుతున్నారు.

వారబంధీ ప్రకారం..

ఇంతవరకు పూర్తిస్థాయిలో వర్షాలు లేకపోవడం వల్ల రైతులందరికీ ప్రయోజనం చేకూరేలే ఈసారి కూడా తోటపల్లి సాగునీటిని వారబంధీ ప్రకారం విడుదల చేయనున్నారు. ఈ నెల 11 నుంచి 18 వరకు శ్రీకాకుళం బ్రాంచ్ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయనున్నారు. చీపురుపల్లి మండలం నడిపల్లి వద్ద నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. కాలువ సమీపంలో చెరువులు నింపుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

ముందస్తుగానే..

రైతుల ఇబ్బందులు దృష్ట్యా ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి ఆగస్టులో రావాల్సిన సాగునీరు ముందుగానే వస్తోంది. ఖరీఫ్ పంటలతో పాటు, చెరువులు నింపుకునేందుకు ఆస్కారం ఉంది. ఈ నెల 11 నుంచి 18 వరకు శ్రీకాకుళం బ్రాంచ్ కెనాల్‌కు సాగునీరు వస్తుంది. నీటి సామర్థ్యం పెరిగితే నిత్యం సాగునీరు విడుదల చేస్తాం.

– రామలక్ష్మి, తోటపల్లి జేఈ

ప్రత్యేకంగా దృష్టి సారించాం..

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రణస్థలం, లావేరు, జి.సిగడాం మండలాలకు తోటపల్లి కాలువ సాగునీరు సకాలంలో విడుదల చేయాలని అధికారులను ఆదేశించాం. ప్రస్తుతం వారబంధీ ప్రకారం వారం రోజుల పాటు సాగునీరు విడుదల చేస్తున్నారు. పూర్తి స్థాయిలో వర్షాలు పడితే ఖరీఫ్ సీజన్ మొత్తానికి సాగునీరు అందేలా చూస్తాం.

– గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

రూ.లక్షా నలభై వేలు చోరీ



వాచ్‌మన్‌ను విచారిస్తున్న సీఐ శ్రీనివాసరావు

కాశీబుగ్గ: పలాస మండలం రాజగోపాలపురం క్వారీలో దోపిడీ జరిగింది. దీనిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. రాజగోపాలపురం, సున్నాడ గ్రామాల మధ్య ఉన్న అమ్మిరెడ్డికి చెందిన క్వారీలో మంగళవారం వేకువజామున ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనంగా ప్రవేశించారు. వాచ్‌మెన్ కాళ్లు చేతులు కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి, తలుపులు పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలను గునపాలతో బద్దలుగొట్టి అరలో ఉన్న రూ.లక్షా నలభైవేలను దోచుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న కాశీబుగ్గ సీఐ గుగ్గిలాపు శ్రీనివాసరావు దోపిడీ కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం నుంచి క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దించారు. ఫింగర్ ప్రింట్స్‌తో పాటా పరిసర ప్రాంతాలలో పోలీసు జాగిలాలతో దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగు పడి వ్యక్తికి గాయాలు



తవిటియ్యను చికిత్స కోసం తీసుకువెళుతున్న 108 సిబ్బంది

లావేరు: మండలంలోని చినకొత్తకోటలో పిడుగుపడి అదే గ్రామానికి చెందిన వంగపూడి తవిటియ్య అనే వ్యక్తి గాయపడ్డాడు. తవిటియ్య మంగళవారం మధ్యాహ్నం పాడి ఆవులను పొలాల్లో మేపుతుండగా ఒక్కసారిగా పిడుగుపడింది. తీవ్రంగా గాయపడటంతో స్థానికులు స్పందించి 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. సిబ్బంది కె.ఈశ్వరరావు, జి.సత్యనారాయణలు గ్రామానికి తవిటియ్యను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

వృద్ధురాలు ఆత్మహత్య

టెక్కలి రూరల్: మండలంలోని సీతారాంపల్లికి చెందిన బోలుపద్ర గరికమ్మ(62) అనే వృద్ధురాలు సూపర్ వాస్మోల్-33 తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గరికమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్థాపానికి గురై సోమవారం అర్ధరాత్రి సూపర్ వాస్మల్ తాగింది. కుటుంబసభ్యులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు టెక్కలి ఎస్‌ఐ-2 రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదుకుంటాడనుకున్న కొడుకు అందని లోకాలకు..!



శ్రీనివాసరావు (ఫైల్)

మందస: ఆదుకుంటాడని భావించిన ఆ తల్లి శరఘాతం లాంటి సమాచారం విని తల్లడిల్లిపోతోంది. కుమారుడు ఇకలేడన్న పిడుగు లాంటి వార్తతో తనకు దిక్కెవ్వంటూ రోదిస్తోంది. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన రాంపురం పంచాయతీ బిడిమిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బడియా శ్రీనివాసరావు(30) బొలేరో వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కిడ్నీవ్యాధితో బాధపడుతున్న తల్లి తులసమ్మను జాగ్రత్తగా చూసుకుంటున్నాడు. విధుల్లో భాగంగా ఒడిశా వెళ్తుండగా గారబంద వద్ద ప్రమాదవశాత్తూ వాహనం బోల్తా పడటంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మరణించాడు. పర్లాకిమిడిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బిడిమి తీసుకువచ్చి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రి కామదేను ఇప్పటికే మరణించగా.. తల్లి వృద్ధాప్యంతో పాటు కిడ్నీవ్యాధితో బాధపడుతోంది. ఆదుకుంటున్న కొడుకు అర్థాంతరంగా వెళ్లిపోవడంతో తల్లి తులసమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 36 గంటల నిరసనలో భాగంగా 2వ రోజు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్-హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, వైఎస్ఆర్ పోషణకు మెనూ చార్జీలు పెంచాలని, ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా కలెక్టరేట్‌కు ర్యాలీగా బయలుదేరిన అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేయడానికి ప్రయత్నించిన సమయంలో తోపులాట జరిగింది. అనంతరం 70 మందిని అరెస్ట్ చేసి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించి వ్యక్తిగత పూచీకత్తులతో విడుదల చేశారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,510-00
బంగారం(22సి. 10గ్రా.)	54,550-00
వెండి (కిలో)	76,700-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210